## మా అమ్మానాన్నలకు ఖర్చు పెట్టొద్దంటున్నాడు!

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

నేనో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నా. నాకు నెలకు ముప్ఫైఐదువేల రూపాయలు జీతం. అదనంగా మరికొంత అలవెన్సుల రూపంలో వస్తుంది. నాకు రెండేళ్ల క్రితం పెళ్లయ్యింది. మా వారు కూడా ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. మా అత్తింటివారు ఆర్థికంగా బలవంతులు. అయినప్పటికీ వాళ్లు ఇల్లు కట్టుకుంటుంటే బాధ్యతతో ఎనిమిది లక్షల రూపాయలు ఇచ్చాం. వాళ్లు ఇల్లు కట్టి అద్దెకు ఇచ్చారు. మా చెల్లి చదువు పూర్తై ఉద్యోగం తెచ్చుకునేవరకూ నేను మా అమ్మానాన్నలకు నెలకు ఎనిమిది నుంచి పదివేల రూపాయల్ని ఇద్దామనుకుంటున్నా. కానీ మా వారు ఒప్పుకోవట్లేదు. అమ్మాయికి తల్లిదండ్రుల బాధ్యత ఉండదు అంటున్నారు. అమ్మాయి ఎందుకు తల్లిదండ్రుల కష్టాన్ని పంచుకోకూడదు. వాళ్లే లేకపోతే నేను లేను కదా! లీగల్‌గా నాకైదేనా సాయం అందుతుందా?

- ఓ సోదరి

మీ ప్రశ్నకు లీగల్‌గా కంటే లాజికల్‌గా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. తల్లిదండ్రులకి ఆర్థికంగా సాయం చేయాల్సిన బాధ్యత పిల్లలదే. తమని తాము పోషించుకోలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకోసం 2007లో సీనియర్ సిటిజన్ యాక్ట్ వచ్చింది. ఈ చట్టంలో పిల్లలు అంటే... కొడుకు, కూతురు, మనవడు, మనవరాలు (మేజర్స్) అని అర్థం. దీనిలోని సెక్షన్ 5 ప్రకారం తమని తాము పోషించుకోలేని స్థితిలో ఆ తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి భరణం కోరుతూ ట్రిబ్యునల్‌కి పిటిషన్ దాఖలు చేయవచ్చు. దరఖాస్తు పరిశీలించిన మీదట ఆ ట్రిబ్యునల్ పిల్లలకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. వాళ్లని పిలిపించి, వారి ఆర్థిక స్థోమతను పరిశీలించి తల్లిదండ్రులకు నెలవారీ మెయింటెనెన్స్ ఇవ్వమని చెబుతుంది. సాధారణంగా తల్లిదండ్రులు కూడా కేవలం మగపిల్లల నుంచే పోషణ నిమిత్తం అడుగుతున్నారు. కూతుళ్ల నుంచీ అడగొచ్చు. చాలామందికి ఈ విషయం తెలియకపోవడం ఓ కారణమైతే అల్లుడు ఒప్పుకోడనుకుని అమ్మాయిల్ని ప్రతివాదులుగా చేర్చడం లేదు. సాధారణంగా మెయింటెనెన్స్ పదివేలకు మించదు. ఈ డబ్బులు కూతురు ఇవ్వాలా... లేక కొడుకు ఇవ్వాలా... అనేది వాదనలు విన్న మీదట వారి ఆర్థిక పరిస్థితులను బట్టి నిర్ణయించడం జరుగుతుంది. సీనియర్ సిటిజన్ యాక్ట్‌లో సెక్షన్ 23 ప్రకారం పిల్లలకు ఇచ్చిన ఆస్తులు, వాటి మీద వచ్చే ఆదాయం నుంచి తల్లిదండ్రుల పోషణకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ బలవంతంగా తల్లిదండ్రుల నుంచి వారి పిల్లలు ఆస్తులను రాయించుకుంటే అది చెల్లదని చెప్పే హక్కు కూడా ట్రిబ్యునల్‌కి ఉంది. కోర్టు ఇవన్నీ పరిశీలించి తీర్పు ఇస్తుంది. మీరు కూడా అత్తింటి వారికి ఇచ్చిన సొమ్ముకు ఆధారాలు ఉంటే వాటిని తిరిగి ఇవ్వమని కోర్టులో కేసు వేయవచ్చు. లేదా మీ తల్లిదండ్రుల చేత వారి పోషణ కోసం కోర్టులో మెయింటెనెన్స్ పిటిషన్ వేయించండి. దానిలో మిమ్మల్ని కూడా ప్రతివాదిగా చేర్చమనండి. అలానే, వారు మీకు ఇచ్చిన డబ్బుల వివరాలు కూడా పొందుపరచవచ్చు. ముందుగా మీ సంసారంలో గొడవలు రాకుండా మధ్యవర్తుల ద్వారా అత్తమామలకు చెప్పించండి. మీకు మీ కుటుంబాన్ని పోషించుకునే స్థోమత ఉండి, ఎలాంటి ఆర్థిక సమస్యలు లేకపోతే మీ తల్లిదండ్రులకు సాయం చేయడానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. ఇది సున్నితమైన విషయం కాబట్టి మీ అత్తింటివాళ్లకు మరీ ముఖ్యంగా మీ భర్తకు అర్థమయ్యేలా వివరించండి. లాయర్ దగ్గరకు కానీ మీడియేటర్ దగ్గరకు కానీ వెళ్లి అతనికి చెప్పించండి. లేదా వారు ఇచ్చిన డబ్బులు తిరిగి తీసుకోవడానికి మీ తల్లిదండ్రుల చేత మిమ్మల్ని కూడా ప్రతివాదిగా చేసి ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేయమనండి. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

